క్లుప్తంగా

వివక్ష లేకుండా సంక్షేమ పథకాలు



కాట్రేనిపాడులో మహిళకు బ్రోచర్ ఇస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

రాజోలు: సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ఎలాంటి వివక్ష లేకుండా లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తుందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శనివారం కాట్రేనిపాడులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రాపాక నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సీఎం జగన్ పాలనలో సంక్షేమం విరాజిల్లుతోందన్నారు. కులం, మతం, పార్టీ వంటి వివక్షను దూరం చేసి వలంటీర్ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. పార్టీ నాయకులు పైడిపర్తి రామారావు, కృష్ణాజీ, చెల్లింగి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

కీర్తి చక్ర పురస్కార గ్రహీత కుటుంబానికి సన్మానం



నర్శిపూడిలో కీర్తిచక్ర వీవీఆర్ కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరిస్తున్న గ్రామస్తులు

ఆలమూరు: ఆఫ్ఘనిస్తాన్‌లోని కాబూల్‌లో భారత రాయబార కార్యాలయంపై 2008లో జరిగిన ఉగ్రవాదుల దాడిలో అమరులైన కీర్తిచక్ర అవార్డు గ్రహీత వాడపల్లి వెంకటేశ్వరరావు కుటుంబాన్ని గ్రామస్తులు మండలంలోని నర్శిపూడిలో ఘనంగా సత్కరించారు. పూర్వీకుల ఆస్తులకు సంబంధించిన కొంతభూమిని గ్రామంలో నిర్మిస్తున్న కోదండ రామాలయానికి వితరణగా ఇచ్చేందుకు భార్య మాలతీరావు, కుమార్తె గ్రామానికి వచ్చారు. స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలోని వేదిక వద్ద అమలాపురం బీజేపీ పార్లమెంట్ కార్యవర్గ సభ్యుడు వడ్డీ దొరయ్యనాయుడు ఆధ్వర్యంలో శనివారం వారికి ఈ సన్మానం జరిగింది. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దున్నే స్వామినాయుడు, దేవస్థానం ఏసీ కేఎస్‌డీవీ ప్రసాదరావు, ఈట ఎంఎస్సార్ కృష్ణ, కోదండ రామాలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం

ఆలమూరు: మండలాభివృద్ధికి పార్టీలకతీతంగా సభ్యులందరూ సమష్టిగా కృషి చేద్దామని ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి అన్నారు. ఆలమూరు ఎంపీపీ కార్యాలయంలో శనివారం ఎంపీపీ లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ పాల్గొని మండలంలోని వివిధ గ్రామాల్లో తీసుకున్న అభివృద్ధి చర్యలను వివరించారు. పుంత రోడ్ల ఆధునీకరణకు రూ.40 లక్షలు, గుమ్మిలేరు–జొన్నాడ రహదారి అభివృద్ధికి రూ.19 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. అలాగే వెలుగు, ఎన్ఆర్‌జీఈఎస్, పశుసంవర్ధక, ఇరిగేషన్, గృహ నిర్మాణ, వైద్యారోగ్య తదితర శాఖలు తమ ప్రగతితో పాటు ప్రజలకు అందిస్తున్న సేవలను వివరించారు. పలువురు సభ్యులు లేవనెత్తిన సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. పశుసంవర్ధక శాఖ ఏడీ ఎల్.అనిత, డీటీ పి.జానకిరామయ్య, ఏఓ ఎస్.లక్ష్మీ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



విరాళం అందజేసిన గారపాటి అబ్బులు చౌదరి కుటుంబ సభ్యులు

ఆత్రేయపురం: సొంత ఊరును బాగుచేసేందుకు ఆలయ పునర్నిర్మాణానికి అంకంపాలెం మాజీ సర్పంచ్, సీనియర్ వైఎస్సార్ సీపీ నేత గారపాటి అబ్బులు చౌదరి–శ్రీమతి సుబ్బాయమ్మ సహకారంతో ఆయన కుటుంబసభ్యులు గారపాటి గంగారామ్, గారపాటి వెంకటసుబ్రహ్మణ్యచౌదరిల కుటుంబ సభ్యులు రూ.5 లక్షల విరాళం అందించారు. ఆత్రేయపురం మండలం అంకంపాలెంలో శ్రీలక్ష్మీ గణపతి, శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, శ్రీభక్తాంజనేయ, షిరిడీ సాయినాథుల ఆలయం శిథిలావస్థకు చేరింది. దీంతో గారపాటి కుటుంబ సభ్యులు ఆలయం పునర్నిర్మాణానికి నడుం బిగించారు. ఈ ఆలయ నిర్మాణం తుది దశకు చేరడంతో వచ్చే నెల 8 నుంచి 10 వరకు స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దేవాలయాల నిర్మాణానికి, గ్రామ అభివృద్ధికి గారపాటి కుటుంబీకులకు ఇక్కడ ప్రాధాన్యం ఉంది. విరాళం అందించిన వారిని ఎమ్మెల్యే జగ్గిరెడ్డితో పాటు పలువురు గ్రామస్తులు అభినందించారు.

మదర్‌థెరిసా సేవలు ఎనలేనివి

ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: సేవా రంగంలో మదర్‌థెరిసా చేసిన సేవలు ఎనలేనివని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని రావులపాడు గ్రామ పంచాయతీ వద్ద శనివారం మదర్‌థెరిసా జయంతిని మదర్‌థెరిసా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి హాజరై థెరిసా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ సంస్థ ఫౌండర్ కిషోర్–ఆశ దంపతులు గత 15 ఏళ్లుగా ఈ ప్రాంతంలో దివ్యాంగులపై ప్రేమ, ఆప్యాయత కలిగి సేవలు చేస్తున్నారని కొనియాడారు. అనంతరం డాక్టర్ మల్లిడి రామ్‌సందీప్‌రెడ్డి, డాక్టర్ సత్తి అమృతలను సన్మానించారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు, పండ్లు, రగ్గులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, సర్పంచ్ మట్టా సత్యదేవి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కర్రి నాగిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సాకా ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రావులపాడులో వృద్ధులకు దుప్పట్లు, రగ్గులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆదర్శనీయురాలు మదర్‌థెరిసా

మామిడికుదురు: ప్రపంచానికి శాంతిని ప్రసాదించిన మదర్‌థెరిసాను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని నీతిపూడి గణపతిరావు సూచించారు. మదర్‌థెరిసా జయంతి సందర్భంగా శనివారం నగరం గ్రామ పంచాయతీ వద్ద ఉన్న విగ్రహానికి గణపతిరావుతో పాటు పలువురు ప్రముఖులు పూలమాల వేసి నివాళులర్పించారు. మదర్‌థెరిసా సేవలను కొనియాడారు. ఎంతో మంది అభాగ్యులను అక్కున చేర్చుకున్న మహోన్నత వ్యక్తి మదర్‌థెరిసా అని కీర్తించారు. నగరం పీహెచ్‌సీలో రోగులకు, ఉద్యోగులు కేకులు, డ్రింక్స్, బిస్కెట్ ప్యాకెట్లు పంచారు. మదర్‌థెరిసా గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముత్యాల సత్యనారాయణ, కందాల వెంకటేశ్వరరావు, వానరాశి మాణిక్యాలరావు పాల్గొన్నారు.



నగరంలో మదర్‌థెరిసాకు నివాళులర్పిస్తున్న గణపతిరావు



అంబాజీపేటలో మదర్‌థెరిసాకు నివాళులర్పిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

అంబాజీపేటలో..

అంబాజీపేట: ప్రపంచానికి సేవా మార్గం చాటి మదర్‌థెరిసా పేరుగాంచారని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ సూదాబత్తుల లక్ష్మీభార్గవి, ఏఎంసీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, ఎంపీటీసీల మండల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్ అన్నారు. మదర్‌థెరిసా జయంతి సందర్భంగా ఉందుర్తి నాగబాబు అధ్యక్షతన అఖిలపక్షం ఆధ్వర్యంలో అంబాజీపేట హైస్కూల్ ఎదురుగా ఉన్న థెరిసా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యర్రంశెట్టి పాండురంగారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు స్వీట్లు పంచారు. కార్యక్రమంలో అరిగెల బలరామమూర్తి, మైలా ఆనందరావు, చింతపల్లి వెంకటేశ్వరరావు, ఆదుర్తి నారాయణమూర్తి, నెల్లి వెంకటరమణ, మైపాల తాతాజీ తదితరులు పాల్గొన్నారు. అంబాజీపేట, తొండవరంలలో జెడ్పీ హైస్కూళ్లలో థెరిసా జయంతిని ఘనంగా నిర్వహించారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: అంతర్వేదికర జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం మదర్‌థెరిసా జయంతి ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని పి.సోమసూర్య కుమారి, థెరిసా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సహచర టీచర్లు, విద్యార్థులు కూడా ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

ఆలమూరులో..

ఆలమూరు: సంఘ సేవకురాలు మదర్‌థెరిసా జయంతి వేడుకలు మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం ఘనంగా జరిగాయి. సంధిపూడి స్థానిక పంచాయతీ కార్యాలయం మదర్ యూత్ ఆధ్వర్యంలో గ్రామస్తులు మదర్‌థెరిసా విగ్రహం వద్ద పూలమాల వేసి నివాళులు అర్పించారు.

కొత్తపేటలో..

కొత్తపేట: మండలంలోని వానపల్లి జెడ్పీ హైస్కూల్లో శనివారం మదర్ థెరిసా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండపేట విజయం చారిటబుల్ ట్రస్ట్ సమకూర్చిన దుప్పట్లను 20 మంది వృద్ధులకు పంపిణీ చేశారు. అలాగే పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష అట్టలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ వాసంశెట్టి వీరస్వామి శేషు, కె.శివశంకర్ పాల్గొన్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: మదర్‌థెరిసా సమాజానికి అందించిన సేవలు చిరస్మరణీయమని ఎంపీపీ అంబటి భూలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మదర్‌థెరిసా జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి భూలక్ష్మి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబటి భూలక్ష్మి, రామకృష్ణ, అంబటి కోటేశ్వరరావు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. పి.గన్నవరం శివారు గుత్తులవారిపాలెం ప్రాథమిక పాఠశాలలో మమత స్వచ్ఛంద సమితి అధ్యక్షుడు కోరుకొండ జాన్ ఆధ్వర్యంలో జరిగిన మదర్ థెరిసా జయంతి నిర్వహించి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



గోపాలపురంలో జానకిరామరాజును సత్కరిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



నగరంలో బాలయోగిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

అంబాజీపేట: వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గంలో స్థానం పొందిన నాయకులు కష్టపడి పనిచేసి పార్టీ మరింత అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కార్యవర్గంలో జనరల్ సెక్రటరీగా నియమితులైన ముక్కామలకు చెందిన దేవరపల్లి చినబాలయోగి శనివారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే చిట్టిబాబును సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిగా చినబాలయోగిని ఎమ్మెల్యే సత్కరించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధుల సహాయ సహకారంతో పార్టీ సిద్ధాంతాలను, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి చైతన్యం చేయాలన్నారు. తమకు కేటాయించిన పదవులకు వన్నె తెచ్చేలా, పార్టీ అభివృద్ధికి, వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరవేసేలా కృషి చేస్తానని బాలయోగి చెప్పారు. కార్యక్రమంలో పుల్లేటికుర్రు ఎంపీటీసీ కుసుమ వెంకటేష్, బండారు మల్లి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదరణతో మళ్లీ ప్రభంజనం

కొత్తపేట: అఖండ ప్రజాదరణతో రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయమని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సిఫారసు మేరకు కొత్తపేట మండలం వానపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యుడు సాకా జానకిరామరాజు జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ పార్టీ నాయకులతో గోపాలపురం వెళ్లి ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి ఘనంగా సత్కరించారు. ప్రతిగా జగ్గిరెడ్డి, జానకిరామరాజును సత్కరించి అభినందించారు. పార్టీ అధినేత, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ చెప్పినవి చెప్పినట్టుగా అమలు చేశారన్నారు. దాంతో ప్రజల్లో పార్టీపై అభిమానం మరింత పెరిగిందన్నారు. వారి ఆదరణను సద్వినియోగం చేసుకోవడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వనుం రాంబాబు, పార్టీ నాయకులు బొంతు రాజు, బళ్ల వెర్రియ్య, బళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సచివాలయాలతో విప్లవాత్మక మార్పులు

మామిడికుదురు: సచివాలయాల ద్వారా విప్లవాత్మక మార్పులకు ప్రభుత్వం నాంది పలికిందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. పెదపట్నంలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.25 లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను సచివాలయాల ద్వారా వారి స్వగ్రామంలోనే అందిస్తున్నామన్నారు. సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. రాష్ట్ర సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల పక్షపాతి అని పేర్కొన్నారు. నిరంతరం ప్రజల శ్రేయస్సు కోసం పరితపిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, సర్పంచ్ గుబ్బల దుర్గ, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, మండల జేసీఎస్ కన్వీనర్ జక్కంపూడి వాసు, నగరం ఏఎంసీ వైస్ చైర్మన్ కొమ్ముల సత్యామణి, ఉప సర్పంచ్ కొమ్ముల నందుబాబు, పార్టీ నేతలు తులా గోపాలకృష్ణ, కుసుమ శ్రీధర్, పీఆర్ ఏఈ కృష్ణంరాజు, పంచాయతీ కార్యదర్శి తాడి ఏసుబాబు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



పెదపట్నంలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: సీఎం జగన్ ప్రభుత్వ పాలనను ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకువచ్చారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మండలంలోని మొండెపులంకలో నిర్మాణంలో ఉన్న గ్రామ సచివాలయం, వెల్‌నెస్, ఆర్‌బీకే సెంటర్ భవనాలను శనివారం ఆయన పరిశీలించారు. చిట్టిబాబు మాట్లాడుతూ నాణ్యతతో భవనాలను నిర్మించాలని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలను నిర్మిస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కత్తిడౌన్ చేసి.. విధులు బహిష్కరించి..

మామిడికుదురు: దశల వారీగా ఆందోళన నిర్వహిస్తున్న అప్పనపల్లి బాలబాలాజీ స్వామి దేవస్థానం కేశ ఖండన శాఖ కార్మికులు శనివారం నుంచి కత్తి డౌన్ చేసి నిరసనను ఉధృతం చేశారు. విధులను బహిష్కరించడంతో స్వామికి తలనీలాలు సమర్పించేందుకు వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవో 110ని తక్షణం అమలు చేయాలని డిమాండ్ కార్మికులు డిమాండ్ చేశారు. కేశఖండన శాలలో తలనీలాలు తీస్తున్న 37 మంది కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.20 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జీఓ అమలు కోరుతూ ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం శూన్యమని వాపోయారు. ప్రభుత్వం జీవో విడుదల చేసి నాలుగు నెలలు కావస్తున్నా దాన్ని ఇంత వరకు అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు విధులు బహిష్కరించడంతో స్వామి వారికి తలనీలాలు సమర్పించేందుకు వచ్చిన భక్తులు పాశర్లపూడి, మామిడికుదురు గ్రామాలకు వచ్చి బార్బర్ షాపుల్లో జుట్టు తీయించుకున్నారు. నిరసనలో సంఘం అధ్యక్షుడు రామేశ్వరపు నాగవీరవెంకటసత్యప్రసాద్, కార్యదర్శి పసలపూడి వీరవెంకటదుర్గారావు, గౌరవాధ్యక్షుడు కాజులూరి సత్యనారాయణమూర్తి, కోశాధికారి రామేశ్వరపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. వీరి ఆందోళనకు జనసేన మద్దతు తెలిపింది. జీఓ 110 వెంటనే అమలు చేయాలని కోరుతూ ఆలయ ఉద్యోగులకు మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, ఆ పార్టీ నేతలు వినతిపత్రం ఇచ్చారు.



అప్పనపల్లిలో కత్తి డౌన్ చేసి నిరసన చేపట్టిన కేశ ఖండన శాల కార్మికులు

తల్లిదండ్రులు కావాలనే కల సాకారం



కొత్తపేటలో సంతాన సాఫల్య కేంద్రాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

కొత్తపేట: భారతదేశంలోనే అతి పెద్ద సంతాన సాఫల్య చికిత్సలో పేరుగాంచిన ఇందిర ఐవీఎఫ్, కొత్తపేటలో భాస్కర హాస్పిటల్ భాగస్వామ్యంతో ప్రారంభించిన సంతాన సాఫల్య చికిత్సతో తల్లిదండ్రులు కావాలనే దంపతుల కల సాకారం కానుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. కొత్తపేటలో భాస్కర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, ఇందిర ఐవీఎఫ్ భాగస్వామ్యంతో సంతాన సాఫల్య చికిత్స కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సెంటర్‌ను శనివారం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రారంభించారు. నేషనల్ ఫ్రాంచైజ్ హెడ్, సీహెచ్ఆర్ఓ ఇందిర ఐవీఎఫ్ జయంత సాహో, హైదరాబాద్ ఇందిర ఐవీఎఫ్ సెంటర్ హెడ్ డాక్టర్ తృప్తి గణపతి వివిధ విభాగాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు డాక్టర్ మెంటే ఉదయభాస్కరరావు అధ్యక్షత వహించగా విప్ జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విప్ జగ్గిరెడ్డి మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ లెక్కల ప్రకారం దేశంలో దాదాపు 40 శాతం మంది సంతానలేమితో బాధపడుతున్నారన్నారు. ఆ దంపతుల సమస్యలను పరిష్కరించడానికి అత్యాధునిక చికిత్సా విధానాలు, మెరుగైన వైద్య సేవలు అందించడానికి భాస్కర ఐవీఎఫ్‌తో ఇందిర ఐవీఎఫ్ కలసి పనిచేయడానికి ముందుకు రావడం శుభపరిణామమని అన్నారు. సంతానలేమి దంపతులు ఈ సంతాన సాఫల్య కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మాట్లాడుతూ తల్లిదండ్రులు కావాలనే వారి ఆకాంక్షను నెరవేర్చడానికి సంతానోత్పత్తి చికిత్సల వేదికగా ఈ సెంటర్ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, పార్టీ మండల అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ ముసునూరి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ పేపకాయల బ్రహ్మనందం, ఇందిర ఐవీఎఫ్ ఎండీ, సహ వ్యవస్థాపకుడు నితిన్ ముర్డియా, ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ వి.ప్రదీప్తికరుణ, వివిధ విభాగాల నిపుణులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌ను కట్టడి చేయాలి

రాజోలు: విద్యాసంస్థల్లో ర్యాగింగ్ దురాచారాన్ని సంఘటితంగా కట్టడి చేయాలని రాజోలు జూనియర్ సివిల్ జడ్జి కె.హిమబిందు అన్నారు. శనివారం రాజోలు ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో జరిగిన న్యాయ అవగాహన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ర్యాగింగ్ నిరోధక చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రాడ్యుయేషన్ స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించే ప్రయత్నం చేయాలన్నారు. తొలుత మదర్‌థెరిసా జయంతి పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు, బార్ అసోసియేషన్ కార్యదర్శి కొక్కెరగడ్డ శేషగిరిరావు, న్యాయవాది జి.రజిత, వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, అధ్యాపకులు రాజ్‌కుమార్, శ్రీరామ్మూర్తి, నల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.



రాజోలు డిగ్రీ కళాశాలలో సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి హిమబిందు

4జీ సేవలు ప్రారంభం

రాజోలు: రాజోలులోని పలు ప్రాంతాలకు బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలను ప్రారంభించినట్టు రాజోలు టెలికాం సబ్ డివిజనల్ ఇంజినీర్ వడ్డి సుష్మ శనివారం తెలిపారు. రాజోలు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న సైక్లోన్ టవర్‌పై 3జీ, 4జీ అందించే ఏర్పాటు చేశామన్నారు. రాజోలులోని కొన్ని ప్రాంతాల నుంచి బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్, ఇంటర్నెట్ సదుపాయంపై వచ్చిన ఇబ్బందులను తొలగించామన్నారు.

31న భూములకు కౌలు వేలం

కొత్తపేట: ఈనెల 31న పలివెల ఉమాకొప్పేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన పలు అంశాలపై, పలివెల ధర్మసత్రానికి చెందిన భూములకు కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో ఎన్‌వీఎస్ఎస్‌వీ ప్రసాద్‌రాజు శనివారం తెలిపారు. స్వామికి భక్తులు సమర్పించే కొబ్బరికాయలు పోగు చేయుటకు, దేవస్థానం ప్రాంగణంలోని కొబ్బరి, మామిడిచెట్ల ఫలసాయానికి, అలాగే ధర్మస త్రం వెనుక భూములకు వేలం నిర్వహిస్తున్నామన్నా రు. మరిన్ని వివరాలకు దేవస్థాన కార్యాలయం వద్ద సంప్రదించాలన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

కొత్తపేట: పేకాడుతున్న అయిదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై వి.మణికుమార్ తెలిపారు. మండలంలోని వానపల్లి శివారు కోతులతోట సమీపాన శనివారం సాయంత్రం పేకాడుతున్నారనే సమాచారంతో ఎస్సై తన సిబ్బందితో దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1650 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజోలు: స్థానిక 11 కేవీ సబ్‌స్టేషన్ విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 27న రాజోలు, సోంపల్లి, శివకోడు, బి.సావరం గ్రామాల్లో విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్టు ఏఈ ఎం.రవికుమార్ శనివారం తెలిపారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు చర్మవ్యాధుల వైద్య శిబిరం

మామిడికుదురు: శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యాన ఉచిత వ్యాస్కులర్, చర్మవ్యాధుల వైద్య శిబిరం జరుగుతుందని ఆ సంస్థల అధినేత కె.ప్రభాకర్ శనివారం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఏషియన్ వ్యాస్కులర్ హాస్పిటల్ సౌజన్యంతో జగ్గన్నపేట సత్యసాయి కల్యాణ మండపం ప్రాంగణంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు శిబిరం జరుగుతుందన్నారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సమస్యల పరిష్కార దిశలో సొసైటీల అధ్యక్షులు పని చేయాలి

మలికిపురం: సొసైటీ అధ్యక్షులు సదరు సొసైటీల్లో సభ్యులకు వచ్చే సమస్యల పరిష్కార దిశలో పనిచేయాలని అమలాపురం డివిజనల్ కో ఆపరేటివ్ అధికారి టి.బుజ్జయ్య అన్నారు. శనివారం లక్కవరం మంగెన గంగయ్య కల్యాణ మండపంలో జాయింట్ ఫార్మింగ్ కో ఆపరేటివ్ సొసైటీల, కో ఆపరేటివ్ కలెక్టివ్ ఫార్మింగ్ సొసైటీల పాలకవర్గ సభ్యులకు లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ అనే అంశంపై మూడు రోజుల శిక్షణలో భాగంగా రెండో రోజు జరిగిన తరగతుల్లో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సొసైటీల్లో సభ్యులకు ఎదురయ్యే సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తెచ్చి, వాటిని పరిష్కరించి, వారికి అండగా ఉండాలని సూచించారు. నాయకత్వాన్ని పెంచుకోవాలనుకునే వారు ఆయా విషయాలు గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. ఏవో ఎస్.రాకేష్ మాట్లాడుతూ, ప్రభుత్వం నుంచి అందే రైతు భరోసా సాయం విషయంలో వచ్చే సాంకేతిక పరమైన సమస్యలు, వాటి పరిష్కారం గురించి ఆయన వివరించారు. ట్రైనింగ్ ఇన్‌చార్జ్, రామదాసు కో ఆపరేటివ్ ట్రైనింగ్ అధ్యాపకుడు ఆదిమూలం వెంకటేశ్వరరావు, బీవీవీ సత్యనారాయణ, డివిజనల్ సహకార కార్యాలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, లక్కవరం పీఏసీఎస్ సీఈవో నారిన పుల్లేశ్వరరావు, సొసైటీల పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రహదారులను ముంచెత్తిన వర్షం

మామిడికుదురు: మండల వ్యాప్తంగా శనివారం భారీ వర్షం కురిసింది. భారీ వర్షంతో రహదారులపై భారీగా నీరు నిలిచి పోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మామిడికుదురు, పాశర్లపూడి, నగరం గ్రామాల్లో 216వ నంబర్ జాతీయ రహదారిపై ముంపు నీరు నిలిచిపోయింది. పలు గ్రామాల్లో ముంపు నీటితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత కొంత కాలంగా సరైన వర్షాలు లేక ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఈ వర్షం నీరు ఎంతో మేలు చేస్తుందని రైతులు చెబుతున్నారు. కొబ్బరి తోటలకు, కూరగాయల పంటలకు, వరి చేలకు ఈ వర్షం మేలు చేస్తుందని పేర్కొంటున్నారు.

సఖినేటిపల్లి: మండలంలో శనివారం వేకువజామున సుమారు గంటన్నర పాటు ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై రాకపోకలు సాగించేందుకు ప్రజలు నానాఅవస్థలు పడ్డారు.

ట్రిబ్యునల్ తీర్పును అమలు చేయాలి

మలికిపురం: తీర ప్రాంత గ్రామాల్లో ఆక్వా అక్రమ సాగును అరికట్టడంలోను, జాతీయ హరిత ట్రిబ్యునల్ తీర్పును అమలు చేయడంలో సంబంధిత అధికారులు విఫలమయ్యారని మానవ హక్కుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు చెవ్వాకుల వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు. సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలెం గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ యెనుముల వెంకటపతి రాజా నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్జీటీ)లో వేసిన కేసు నిమిత్తం వచ్చిన తీర్పు మేరకు సముద్రతీర ప్రాంతాల్లో ఆక్వా అక్రమ సాగును తక్షణమే నిలుపుదల చేయాలని తీర్పు నేపథ్యంలో అధికారులు హడావుడిగా సాగుదారులకు నోటీసులు ఇచ్చి సంవత్సరం అయినప్పటికీ, ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు అమలు చేయకపోవడం తీర్పును నిర్లక్ష్యం చేయడమేనని, సంబంధిత అధికారులపై జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టాలని మానవ హక్కుల వేదిక డిమాండ్ చేస్తున్నట్టు ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

యాప్‌లో నమోదు చేయాలి

అంబాజీపేట: వరి పంట ప్రయోగాలకు ఎంపికైన గ్రామాల్లోని రైతులు, పంటల విస్తీర్ణం, సర్వే నంబర్ తదితర అంశాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాప్‌లలో సక్రమంగా నమోదు చేయాలని కొత్తపేట డివిజన్ ఉప గణాంకాల అధికారి పీవీఎస్ ప్రకాశరావు అన్నారు. అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో పంటకోతల ప్రయోగాలు, వాటి వివరాలను యాప్‌లలో నమోదుపై అంబాజీపేట, పి.గన్నవరం మండలాల ఏఈఓ, వీహెచ్ఏలకు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ప్రకాశరావు మాట్లాడుతూ అంబాజీపేట మండలంలో 40, పి.గన్నవరం మండలంలో 44 గ్రామాలను వరి పంటకోత ప్రయోగాలకు ఎంపిక చేశామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, పంట కోత ప్రయోగాల యాప్‌లలో పంట సర్వే నంబర్, విస్తీర్ణం, రైతు వివరాలను పొందుపర్చాలన్నారు. ఈ యాప్‌లలో పంట దిగుబడి, అంచనా, బీమాలతో పలు విషయాలపై అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు సీహెచ్‌డీ విజయ్‌కుమార్, ఎ.కల్యాణ్ సూర్యకుమార్, ఏఎస్వో ఎస్.పుష్పరాజు, ఏఈఓ డి.దుర్గారావు, వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

రోగులకు పులిహోర పంపిణీ

రావులపాలెం: స్థానిక ఊబలంక పీహెచ్‌సీ వద్ద శనివారం రోగులకు పులిహోర పొట్లాలను పంపిణీ చేశారు. వాసవి సేవా సంఘం సౌజన్యంతో జరిగిన ఈ కార్యక్రమానికి ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పులిహోర పొట్లాలు పంపిణీ చేశారు. స్థానిక వాసవీ క్లబ్ అధ్యక్షుడు పులవర్తి గోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రతినెలా 9, 10 తేదీల్లో, ప్రతివారం సోమవారం, బుధవారాల్లో రోగులకు పులిహోర పంపిణీ చేస్తామన్నారు.

117 జీవోను రద్దు చేయాలి

మామిడికుదురు: సంస్కరణల పేరుతో విడుదల చేసిన 117 జీవోను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి డిమాండ్ చేశారు. మామిడికుదురు ఎమ్మార్సీ ప్రాంగణంలో శనివారం జరిగిన యూటీఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 3,4,5 తరగతుల విలీనానికి సంబంధించిన ఈ జీవోతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. దీంతో పాటు సీపీఎస్‌ను రద్దు చేయాలని, డీఏ బకాయిలను తక్షణం విడుదల చేయాలని, పీజీటీలకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూటీఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బీమాపై అవగాహన

అయినవిల్లి: మండలంలోని కె.జగన్నాథపురం సచివాలయం గృహ సారథులకు బీమా పథకంపై జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ మేడిశెట్టి ఉషారాణి అధ్యక్షతన కార్యక్రమం జరగ్గా, డీఎంసీ చైర్మన్ చైర్మన్ వేటుకూరి వెంకటరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ మెంబర్ షేక్ వలీ, ఉప సర్పంచ్ ఆకుమర్తి దుర్గారావు, సొసైటీ చైర్మన్ మట్టపర్తి బుల్లి అబ్బులు, సచివాలయం కన్వీనర్లు కమిడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి పుల్లం శెట్టి తదితరులు పాల్గొన్నారు. అలాగే పోతుకుర్రులో బీమాపై అవగాహన కల్పించారు.

టీడీపీ అగ్రనేతలపై ఫిర్యాదు

అంబాజీపేట: రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా టీడీపీ వ్యవహరిస్తోందంటూ వైఎస్సార్ సీపీ మండల సోషల్ మీడియా ప్రతినిధులు శనివారం అంబాజీపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. టీడీపీ శ్రేణుల్లో 2019 నుంచి 2024 వరకూ ఎవరి మీద ఎక్కువ పోలీసు కేసులు ఉన్నాయో వారికే భవిష్యత్తులో నామినేటెడ్ పదవులు ఇస్తామని లోకేష్ పాదయాత్రలో ప్రకటించారని గుర్తు చేశారు. అంతేకాకుండా తంబళ్లపల్లి, పుంగనూరు, మాచర్ల, నూజివీడు మండలం తుక్కలూరుల్లో టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టేలా ఆ పార్టీ నాయకులు వ్యవహరించారని సోషల్ మీడియ కన్వీనర్లు అరిగెల శివకల్యాణ్, నాగాబత్తుల శీలు ఆరోపించారు. శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, రాష్ట్ర శాఖ అధ్యక్షుడు అచ్చెంనాయుడులపై చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో కోరారు.